సాక్షి
సంగారెడ్డి
శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



అదనంగా 356 బస్సులు

దసరా సందర్భంగా ఆర్టీసీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 356 స్పెషల్ బస్సులను నడపనుంది. వివరాలు IIలో ▸



చెరుకు.. పెట్టుబడి కష్టాలు

చెరుకు పంటపై పెట్టుబడి వ్యయం ఏటేటా పెరుగుతుండటం రైతులను కలవర పెడుతోంది. వివరాలు IIలో ▸



రైతుబజార్ కోసం

భారతినగర్ డివిజన్ పరిధిలోని రైతుబజార్ అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

పకడ్బందీగా రికవరీ చట్టం అమలు

అదనపు కలెక్టర్ మాధురి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సంగారెడ్డి జోన్: సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) అందించడంలో విఫలమైన రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం కఠినంగా అమలు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ మాధురి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతోపాటు రైస్ మిల్లర్లతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..డిఫాల్ట్ మిల్లర్ల ఆస్తులను జప్తు చేయడంతోపాటు అవసరమైతే వాటిని వేలం చేసి సీఎంఆర్ ధాన్యం నిధులు రాబట్టాలన్నారు. సీఎంఆర్ నిధులు పూర్తిస్థాయిలో రికవరీ తప్పనిసరి పేర్కొన్నారు. రికవరీలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఇకపై ప్రతీ వారం డిప్యూటీ తహసీల్దార్ తమ పరిధిలోని రైసుమిల్లర్ల నుంచి సీఎంఆర్ రికవరీపై సమీక్ష నిర్వహించి ప్రగతి నివేదికను అందించాలని ఆదేశించారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం: గోదావరి



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న గోదావరి

జిన్నారం(పటాన్‌చెరు): రక్తదానం చేయడంతో మరొకరి ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో శుక్రవారం సేవాపక్షం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ...ప్రధాని మోదీ జన్మ దినాన్ని పురస్కరించుకుని యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

అదనపు ఎస్పీగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రఘునందన్‌రావు

సంగారెడ్డి జోన్: జిల్లా అదనపు ఎస్పీగా సీహెచ్.రఘునందన్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం జరిగిన బదిలీలో పదోన్నతి పొంది జిల్లా అదనపు(అడ్మిన్) ఎస్పీగా నియమితులైన సంగతి తెలిసిందే. గతంలో తెలంగాణ పోలీస్ అకాడమీలో డీఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి: పృథ్వీరాజ్

సంగారెడ్డి టౌన్ : భారీ వర్షాలతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య అధ్యక్షుడు పృథ్వీరాజ్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు పంటలను నష్టపోయారని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సంగిశెట్టి, సభ్యులు ధనుంజయ్, గోవురాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'నారింజ'ను సందర్శించిన ఇరిగేషన్ ఈఈ



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఈఈ విజయ్‌కుమార్

జహీరాబాద్: మండలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టును శుక్రవారం నీటిపారుదల శాఖ ఈఈ విజయ్‌కుమార్ సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని వదిలిపెట్టే సమయంలో దిగువన ఉన్న గ్రామాల ప్రజలకు సమాచారం అందించాలని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ ఈఈ జనార్ధన్‌రావు, ఏఈలు శ్రీనివాస్, జానకీరామ్, సిబ్బంది రఘు, ప్రసాద్ ఉన్నారు.

మహిళా సంఘాలకు దసరా జోష్

రేవంతన్న కానుక పేరిట చీరల అందజేత

- నెలాఖరు నుంచి పంపిణీ!
- జిల్లావ్యాప్తంగా 1.94లక్షల మంది సభ్యులు



నారాయణఖేడ్/సంగారెడ్డి టౌన్: దసరా పండుగకు మహిళా సంఘాల్లో జోష్ నింపేందుకు ప్రతీ సభ్యురాలికి చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. 'అక్కా చెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక'పథకం పేరిట మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు ఉచితంగా చీరలను పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలోని ఎస్‌హెచ్‌జీ సభ్యులైన మహిళలకు ఉచిత చీరలు పంపిణీ చేస్తామని గతేడాది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకనుగుణంగా చీరలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 18,848 గ్రూపుల్లో 1.94లక్షల మంది సభ్యులున్నారు. వీరికి ఒక్కో చీర చొప్పున పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకుగాను 1.94లక్షల చీరలు అవసరం అవుతాయి. జిల్లాకు 50% చీరలు సరఫరా జరిగాయి. జిల్లా కేంద్రంలోని ఆయా గోడౌన్లలో అధికారులు వాటిని డంప్ చేసి ఉంచారు. మిగతా చీరలు రెండు మూడు రోజుల్లో జిల్లాకు రానున్నాయి. బతుకమ్మ పండగనాటికి పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచించినా ఈమేరకు పంపిణీ సాధ్యపడేలా లేదు. దీంతో దసరా నాటికి వీటిని పంపిణీ చేయనున్నారు.

చీరల నాణ్యతలో రాజీ పడకుండా ఆరోపణలకు అవకాశం లేకుండా సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో మగ్గాలపై తయారు చేసిన చీరలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో చీరలను ప్రభుత్వం నేయించింది. రూ.800 విలువ గల ఒక్కో చీరను పంపిణీ చేయాలని నిర్ణయించారు. జిల్లాలో నాలుగు మండలాల్లో చీరలను నిల్వ చేసేందుకు సదాశివపేట, జుక్కల్, ముంగీ, హోతి మండలాల్లో నాలుగు గోదాములను ఏర్పాటు చేశారు.

సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో పంపిణీ

మహిళా సంఘాలకు నాయకత్వం వహించే పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), మున్సిపాలిటీల్లో పేదరిక నిర్మూలన మిషన్ (మెప్మా) సంస్థలు ఈ చీరలను పంపిణీ చేసేందుకు లబ్ధిదారుల జాబితాను తయారు చేసింది. టెస్కో సంస్థ తయారు చేసిన చీరలను ఈ రెండు సంస్థలకు ప్రభుత్వం అప్పగించనుంది. వాటిని సంఘాల వారీగా అందరికీ పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఈనెలాఖరులోగా పంపిణీని ప్రారంభించనున్నారు. పంపిణీకి సంబంధించిన తేదీపై ఇంకా స్పష్టత రాలేదు. ఈనెల 30 నుంచి విజయదశమి నాటికి చీరలను పంపిణీ పూర్తి చేయాలని అధికారులు యోచిస్తున్నారు.

ఒక్కో చీర చొప్పున పంపిణీ



జిల్లాకు ఇప్పటికే 50% చీరలు సరఫరా అయ్యాయి. ప్రభుత్వం నుంచి పంపిణీకి సంబంధించి తేదీ నిర్ధారణ కాగానే ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పంపిణీ చేపడతాం. పూర్తిస్థాయిలో చీరలు రావాల్సి ఉంది. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో చీరలు రానున్నాయి. ఒక్కో సభ్యురాలికి ఒక చీర చొప్పున అందజేస్తాం.

– సూర్యారావు, అదనపు డీఆర్‌డీఓ సెర్ప్, సంగారెడ్డి

మహిళా సంఘాలకు ఇచ్చే చీరలు లైట్ బ్లూ కలర్, డార్క్ బ్లూ అంచుతో తయారు చేశారు. బ్లూ కలర్‌తో ఉన్న ఈ చీరలపై తెల్లని రంగు పువ్వులను ముద్రించారు. చీర, జాకెట్‌తో కలిపి 6.3 మీటర్లు ఉండనుంది.

నిమజ్జనం చేసేదెలా?



గుర్రపుడెక్కతో అపరిశుభ్రంగా ఉన్న కల్వకుంట చెరువు

బతుకమ్మ పండుగ సంబురాలు మరో రెండురోజుల్లో మొదలుకానుండగా..ప్రతీ ఏటా బతుకమ్మ నిమజ్జనోత్సవాలకు పట్టణంలోని కల్వకుంట చెరువు వద్దకు మహిళలు, చిన్నారులు వస్తుంటారు. అయితే ప్రస్తుతం ఈ చెరువు మొత్తం గుర్రపు డెక్క పరుచుకుని పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. చెరువులోని గుర్రపు డెక్కను తొలగించడంతోపాటుగా పరిసరాలను పరిశుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– సంగారెడ్డి క్రైమ్:

భవన నిర్మాణానికి సిద్ధంగా భూమి

- త్వరలోనే మంత్రి దామోదరతో భూమి పూజ
- లింగంపల్లి గురుకుల హాస్టల్ నిర్మాణంపై అధికారులు



లింగంపల్లి గురుకుల హాస్టల్ భవన నిర్మాణానికి సిద్ధంగా ఉన్న స్థలం

మునిపల్లి(అందోల్): లింగంపల్లి గురుకుల పాఠశాల హాస్టల్ భవన నిర్మాణానికి స్థలం సిద్ధమైంది. విద్యార్థులు ఉండేందుకు అనువైన స్థలంను సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. పాత హాస్టల్ భవన నిర్మాణ స్థలంలోనే కొత్త భవనం నిర్మించేందుకు అధికారుల పర్యవేక్షణలో శిథిలాలను తొలగించి స్థలాన్ని జేసీబీలతో చదును చేయించారు. విద్యార్థులకు అనువైన స్థలంలో భవన నిర్మాణం, అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు సుమారు రూ.6 కోట్ల నుంచి రూ.9 కోట్ల వ్యయంతో అంచనాలు ప్రతిపాదించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలోనే ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో హాస్టల్ భవన నిర్మాణానికి భూమి పూజ చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే విద్యార్థులు తాత్కాలికంగా ఉండేందుకు రేకుల షెడ్ల పనులు కూడా పూర్తి కావొచ్చినట్లు ఎంపీడీఓ హరినంద్‌రావు తెలిపారు.

టీచర్లకు 'టెట్' మినహాయింపునివ్వాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య



జోగిపేట(అందోల్)/వట్‌పల్లి(అందోల్): టీచర్లు తప్పనిసరిగా ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణులు కావాలన్న దానిపై మినహాయింపు ఇవ్వాలని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎ.మాణయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణకు ఐదేళ్లకు మించి సర్వీస్ ఉన్న టీచర్లు రెండేళ్లలో తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులు కావాలని, లేని పక్షంలో ఉద్యోగం నుంచి రిటైర్ కావాలని సుప్రీంకోర్టు ఈ నెల 1న తీర్పునిచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఈ తీర్పు వల్ల 2010కు ముందు దేశవ్యాప్తంగా నియామకమైన 25 లక్షల మంది టీచర్లపై ప్రభావం చూపుతుందన్నారు. 20 నుంచి 25 ఏళ్ల సర్వీస్‌ను పూర్తిచేసిన టీచర్ల ప్రయోజనాలను కాపాడేందుకు సుప్రీంకోర్టు తీర్పుపై ప్రభుత్వం రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసి టీచర్లకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 2010 తర్వాత నియామకమైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ తప్పనిసరి చేస్తూ విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23లో స్పష్టత ఇచ్చే విధంగా చట్టాన్ని సవరించాలని కోరారు. గత 15 ఏళ్లుగా ఎన్సీటీఈ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా హక్కు చట్టం అమలుకు పూర్వం నియామకమైన వారికి టెట్ అవసరమని చెప్పలేదని స్పష్టం చేశారు. 2010కు ముందు నియామకమైన వారికి టెట్ మినహాయింపు ఇచ్చినట్లు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయని అందుకే సీనియర్ టీచర్లు ఇప్పటివరకు టెట్ పాస్ కావాలనే ఆలోచన చేయలేదని వివరించారు.

ఓపెన్ అడ్మిషన్ల గడువు పెంపు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ విధానంలో 2025–26 ఏడాదికి గానూ పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులలో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 24 వరకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఈ మేరకు డీఈఓ వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తి గల అభ్యాసకులు అధ్యయన కేంద్రాల్లో ధ్రువ పత్రాలు సమర్పించి, అడ్మిషన్ ఫారం పొందాలని సూచించారు. ఈ అడ్మిషన్ ఫారాన్ని www. telanganaopenschool.org ద్వారా నమోదు చేసి, అడ్మిషన్ ఫీజును, టీఎస్ ఆన్‌లైన్, లేదా మీ సేవా కేంద్రాల్లో చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి 80084 03635ని సంప్రదించాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి: రవీందర్‌నాయక్

వట్‌పల్లి(అందోల్): పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా.రవీందర్ నాయక్ పేర్కొన్నారు. అందోల్ మండల పరిధిలోని సంగుపేట రైతువేదిక భవనంలో శుక్రవారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ విద్యార్థులు నిర్వహించిన వివిధ వ్యవసాయ నమూనా ప్రదర్శనలను ఆధారంగా వరి, పత్తి, కంది, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగులో మెళకువలు, ప్రస్తుత యాజమాన్య పద్ధతులను వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.కె.అరుణ, డా.నిర్మల, కె.రాహుల్ విశ్వకర్మలు క్లుప్తంగా వివరించారు. ఇఫ్కో మార్కెటింగ్ మేనేజర్ కృపా శంకర్ ,అసిస్టెంట్ మేనేజర్ చంద్రన్న మాట్లాడుతూ..ప్రతి నానో ఎరువు బాటిల్‌పై పదివేల బీమా కవరేజ్ లభిస్తుందని, గరిష్టంగా రూ.2 లక్షల వరకు బీమా పరిమితి ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే 100% పరిహారం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డా.అలీబాబా, మండల వ్యవసాయ అధికారులు, రైతులు, యంగ్ ప్రొఫెషనల్స్ రేఖా, మనోజ్, యస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంకెళ్లతో న్యాయవాదుల నిరసన



సంకెళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సంగారెడ్డి టౌన్ : న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోర్టు విధులు బహిష్కరించి న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... నాంపల్లి, నాగర్‌కర్నూల్‌లో న్యాయవాదులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి న్యాయవాదులకు రక్షణ చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంకెళ్లు వేసుకుని ధర్నా నిర్వహించారు. కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాగు చేయాలంటే.. వాగు దాటాల్సిందే



- నందివాగు దాటేందుకు రైతుల ఇబ్బందులు
- వరద వస్తే రాకపోకలకు ప్రమాదమే
- వంతెన నిర్మాణానికి రైతుల ఎదురుచూపు
- పట్టించుకోని అధికారులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని కంబాలపల్లి రైతులు నందివాగును దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వాగు పొంగి పొర్లడంతో పంట పొలాలకు వెళ్లేందుకు, పండించిన పంటను తీసుకొచ్చేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వాగు అవతలి వైపు గ్రామానికి చెందిన సుమారు 200 ఎకరాల వ్యవసాయ పొలాలు ఉన్నాయి. ఇందులో పత్తి, వరి, జొన్న తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఆ పొలాలను సాగు చేసేందుకు వాగును దాటి వెళ్లాల్సి ఉంటుంది. వాగు దాటేందుకు వంతెన లేకపోవడంతో రైతులు, కూలీలు తెప్ప సహాయంతో వాగు దాటి సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొందరు కొండాపూర్ మండలంలోని అనంతసాగర్ గ్రామ శివారు మీదుగా సుమారు 10 కిలోమీటర్లు చుట్టూ తిరిగి పొలాలకు చేరుకుంటున్నారు. ఒక్కోసారి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో తమ పొలాల వద్దకు వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు. కొంత మంది ప్రమాదకర పరిస్థితులను కూడా ఎదుర్కొంటూ వాగు దాటి పొలాలకు చేరుకుంటున్నారు. ఇలా చాలామంది రైతులు పంట పొలాలకు వెళ్లలేక, పంటలను కాపాడుకోలేక నష్టపోతున్నారు. పండించిన పంటలు ఇంటికి తీసుకునిరావాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. వాగుపై వంతెన నిర్మించక పోవడంతో 20 ఏళ్ల నుంచి రైతులు అవస్థలు పడుతున్నారు. వరద తగ్గే వరకు ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించలేకపోతున్నారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని వాగుపై వంతెన నిర్మాణం చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు, కూలీలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి

నందివాగుపై బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో తీవ్ర చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

– ఇందూరి బాబు, రైతు కంభాలపల్లి

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది

20ఏళ్లుగా రైతులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు వెళ్లేందుకు రైతులు ప్రమాదకరంగా ఉన్న తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తెప్పను దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– కుమ్మరి ఆంజనేయులు, రైతు కంభాలపల్లి

ఉపాధి పనుల అమలు భేష్

మహారాష్ట్ర అధికారుల బృందం కితాబు



ఉపాధి హామీ గురించి వివరిస్తున్న ఏపీఓ వీరప్ప

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని తొగర్‌పల్లి గ్రామంలో శుక్రవారం మహారాష్ట్ర అధికారుల బృందం పర్యటించింది. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం, డంప్‌యార్డు నిర్మాణాలను పరిశీలించారు. పంచాయతీలో రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ విధానం అమలవుతున్న తీరును పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రమైన కొండాపూర్‌లోని ఎంపీడీఓ కార్యాయలంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనుల వివరాలను ఏపీఓ వీరప్ప మహారాష్ట్ర అధికారులకు వివరించారు.

రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలి



అండర్-17 విజేతగా నిలిచిన జహీరాబాద్ జట్టుకు కప్ అందజేస్తున్న డీఎస్పీ



అండర్-14 విజేతగా నిలిచిన గుమ్మడిదల జట్టుకు కప్ అందజేస్తున్న డీఎస్పీ సైదా

- జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ముగింపు సమావేశంలో డీఎస్పీ సైదా
- విజేత జట్లకు కప్‌ల అందజేత

జహీరాబాద్: జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో కూడా తమ సత్తాను చాటాలని జహీరాబాద్ డీఎస్పీ సైదా ఆకాంక్షించారు. రంజోల్‌లోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలుర, బాలికల విభాగంలో ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి ఉమ్మడి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసే అవకాశం ఉందని తెలిపారు. జహీరాబాద్‌లో జిల్లాస్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన 28 మండలాల్లో 58 జట్ల నుంచి 1,500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో అండర్-17 జట్టులో పుల్కల్ జట్టు విజేతగా, నిజాంపేట జట్టు రన్నర్‌గా నిలిచాయి. అండర్-14 విభాగంలో చౌటకూరు జట్టు విజేతగా, జిన్నారం జట్టు రన్నర్‌గా నిలిచాయి. బాలికలకు నిర్వహించిన పోటీల్లో అండర్-17 టోర్నీలో జహీరాబాద్ జట్టు గెలుపొందగా, రాయికోడ్ జట్టు రన్నర్‌గా నిలిచింది. అండర్-14లో గుమ్మడిదల జట్టు విజేతగా, హత్నూర రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు డీఎస్పీ కప్పులను అందజేశారు.

అదనంగా 356 బస్సులు

- 50శాతం అదనంగా చార్జీలు!
- ప్రతి బస్టాండ్‌లో సిబ్బంది పర్యవేక్షణ
- దసరా సందర్భంగా ఆర్టీసీ ఏర్పాట్లు

సంగారెడ్డి టౌన్: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 356 స్పెషల్ బస్సులను నడపనుంది. సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆదివారం నుంచి పాఠశాలలకు సెలవులు ఉండడంతో ప్రజలు సొంతూర్లకు వెళ్లనున్నారు. వివిధ గ్రామాలలో స్థిరపడిన వారితోపాటు, జీవనోపాధికి వెళ్లిన వారు సైతం గ్రామాలకు తిరిగి వస్తుంటారు. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది ఆర్టీసీ డిపోలలో అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. బస్సుల సంఖ్యను పెంచడంతో కొంత మేర ప్రయాణికులకు ఇబ్బందులు తప్పనున్నాయి. నిత్యం 569 సర్వీసులు తిరుగుతుండగా.. దసరా, బతుకమ్మల సందర్భంగా అదనంగా 356 బస్సులను ఏర్పాటు చేశారు. అదనపు బస్సులకు 50శాతం అదనపు చార్జీలు పెంచే అవకాశాలు ఉన్నాయి. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం ఉండడంతో రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. యాత్ర దానం పేరుతో దాతలు ఎవరైనా ముందుకు వస్తే వారిని తీర్థయాత్రలకు, గ్రామాలకు బస్సు సర్వీసులు నడపడానికి ఆర్టీసీ సిద్ధంగా ఉంది.


బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఏర్పాట్లు పూర్తి: ఆర్‌ఎం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ, దసరా సందర్భంగా 356 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని రీజినల్ మేనేజర్ విజయ్ భాస్కర్ తెలిపారు. ప్రతి బస్టాండ్‌లో అదనపు సిబ్బందిని పర్యవేక్షణకు ఉంచామన్నారు. అవసరాన్ని బట్టి బస్సులను పెంచుతామని, అదనపు చార్జీలు పెంచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. యాత్ర దానం పేరుతో దాతలు ఎవరైనా ముందుకు వస్తే వారిని బస్సు సర్వీసులు నడపడానికి ఆర్టీసీ సిద్ధంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

– ఆర్టీసీ ఆర్‌ఎం విజయ్ భాస్కర్

క్లుప్తంగా

కబడ్డీ పోటీల్లో మొదటి స్థానం


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి

దుబ్బాకరూరల్: సిద్దిపేటలో జిల్లా స్థాయి కబడ్డీ అండర్–17 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలల్లో మండలంలోని హబ్సీపూర్‌లో గల మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. విద్యార్థులు కిరణ్, భవదీష్, భానులను ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి అభినందించారు. అదే విధంగా ఇందుకు కృషి చేసిన పీఈటీ తరుణ్‌రాజ్‌లను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఎలమ్మ దేవాలయంలో చోరీ

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండలం జాలపల్లిలో ఎల్లమ్మ దేవాలయంలో గురువారం రాత్రి దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. గౌడ సంఘం సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ కులదైవమైన ఎల్లమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన గల్లా పెట్టే పగులగొట్టి అందులోని నగదు, అమ్మవారి పుస్తె మట్టెలు, ముక్కుపుడక అపహరించినట్లు తెలిపారు. పుస్తె మట్టెలు ముక్కుపుడక తులం వరకు ఉంటుందని, గల్లా పెట్టెలో రూ.15- 20 వేల వరకు నగదు ఉంటుందని తెలిపారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నాచారం వాగులో యువకుడి మృతదేహం


హుస్సేన్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): మానసిక స్థితి సరిగాలేని యువకుడు వర్గల్ మండలం నాచారం వాగులో శవమై తేలాడు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మానసిక స్థితి సరిగాలేని హుస్సేన్(18) అనే యువకుడు కొన్ని నెలల నుంచి గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి ఆశ్రమ్‌లో ఉంటున్నాడు. ఈ నెల 14న ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆశ్రమ్ నిర్వాహకులు చుట్టుపక్కల వెతికినప్పటికి ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం నాచారం వాగులో యువకుని మృతదేహం తేలింది. హుస్సేన్ మృతదేహంగా ఆశ్రమ్‌కు చెందిన రుశీల్‌నాయర్ గుర్తించారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని మల్లారం శివారులో శుక్రవారం జరిగింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన కార్తీక్(35) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం అనంతసాగర్‌లో డ్రోన్ ద్వారా పంట పొలానికి మందు పిచికారీ చేసి సిద్దిపేటకు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో మల్లారం వద్ద నిలిపి ఉన్న లారీని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. కార్తీక్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మృతి


రాజు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌కు చెందిన దండుగుల రాజు(32) పది రోజుల క్రితం గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల జీవితం మీద విరక్తి చెంది ఈ నెల 8న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పాపన్నపేట(మెదక్): మండలంలోని నాగ్సాన్‌పల్లి గ్రామ శివారునుంచి గురువారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంజీరా నది, చెరువుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

చెరుకు.. పెట్టుబడి కష్టాలు

- ఏటా పెరుగుతున్న పెట్టుబడులు
- దిగుబడి,గిట్టుబాటు ధర లేక నష్టాలు
- ఆందోళనలో చెరుకు రైతులు

చెరుకు పంటపై పెట్టుబడులు ఏటేటా పెరుగుతుండటం సదరు రైతుల్ని కలవరపెడుతున్నాయి. సరైన దిగుబడులు లేక ధర గిట్టుబాటు కాకకష్ట నష్టాలే మిగులుతున్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చెరుకును మరిచి ఇతర పంటలకు మద్దతు ధర పెంచడం, బోనస్‌లు ఇవ్వడం చేస్తుండటంతో చెరుకు రైతులు దిగాలు పడిపోతున్నారు. రాత్రింబవళ్లు కష్టపడితే వచ్చిన పంట దిగుబడితో పెట్టుబడి కోసం చేసిన అప్పులు చెల్లించేందుకే సరిపోతుంది.


గాలివానకు అడ్డం పడిన చెరుకు పంటకు జుడి(జడ)కదుతున్న కూలీలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ సమీపంలో ట్రైడెంట్, సంగారెడ్డి వద్ద గణపతి, రాయికోడ్ వద్ద గోదావరి-గంగా చక్కెర పరిశ్రమలున్నాయి. మూడు కర్మాగారాల పరిధిలో సుమారు 30 వేల ఎకరాల్లో చెరుకు పంట సాగవుతోంది. ఆయా చక్కెర కర్మాగారాల పరిధిలో సుమారు 10 లక్షల టన్నుల పంటను రైతులు పండిస్తున్నారు. పెరిగిన పెట్టుబడుల వల్ల పెద్దగా లాభాలు రావడంలేదని రైతులు వాపోతున్నారు. ఎకరా చెరకు పంట సాగు చేయాలంటే పెట్టుబడులన్నీ కలిపి మొదటి ఏడాది లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. సుమారు 30 టన్నుల వరకు పంట పండుతుంది. ప్రస్తుతం కర్మాగారాలు చెల్లిస్తున్న ధరతో పాలిస్తే కటింగ్, రవాణ తదితర ఖర్చులు పోనూ ఎకరాకు రూ.75 వేల మిగులుతుంది. ఏడాది పొడవునా పంట సాగు కోసం ఎరువు, ఇతర పెట్టుబడులకు తిరిగి అప్పు చేయాల్సివస్తుందని రైతులు వాపోతున్నారు.

వర్షాలతో దెబ్బతిన్న పంట

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరుకు పంట కూడా దెబ్బతింది. చెరకు తోటలో నీరు చేరడం వల్ల పంట ఎదుగుదలపై పడింది. కొన్ని ప్రాంతాల్లో పంట ఏపుగా పెరగడం వల్ల గాలివానకు నేల కొరిగింది. పంటను కాపాడుకొనేందుకు రైతులు అదనంగా ఖర్చు చేసి జుడి(జడ) కట్టడం చేయిస్తున్నారు. అడ్డంగా పడిన చెరుకు గడలు నిటారుగా పెరగడానికి జుడి కడతారు. జుడి కట్టడానికి ఎకరానికి రూ.6 వేల వరకు ఖర్చుచేయాల్సి వస్తుంది. తప్పని పరిస్థితుల్లో రైతులు అప్పుచేసి జుడి(జడ)కట్టిస్తున్నారు. విపరీతంగా పెరిగిన పెట్టుబడుల వల్ల టన్నుకు రూ.3,500 టన్నుకు ధర చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

చెరుకు పంటకు బోనస్ ఇవ్వాలి



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పంటలకు ఇచ్చినట్లుగా చెరుకు పంటకు కూడా బోనస్ ఇవ్వాలి. కనీస ధర కూడా ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ సన్న ఒడ్లకు ఇచ్చినట్లు చెరుకు రైతులకు కూడా బోనస్ ఇవ్వాలి. అప్పుడే చెరుకు రైతులకు మేలు జరుగుతుంది.

– డి.శివకుమార్, రైతు, ఎల్గోయి

భూబదలాయింపుపై రగడ

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన


ఆందోళనకారులను సముదాయిస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): తమకు సమాచారం ఇవ్వకుండానే వేరే వారి పేరిట భూమిని ఫౌతీ చేశారని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం బాధితులు ఆందోళనకు దిగారు. మండలంలోని వెంకటాపూర్ అగ్రహారానికి చెందిన గంగా మాధవి తన భర్త అనారోగ్యంతో చనిపోవడంతో తనకున్న భూమిని తన ఇద్దరు కుమారులు గంగా కుమార్, గౌరీ శంకర్‌ల పేరిట ఫౌతీ చేశారు. ఇంతలోనే వేర్వేరు కారణాలతో ఇద్దరు కుమారులు చనిపోయారు. దీంతో పెద్ద కోడలు తన అత్త మాధవికి బాగోగుల కోసం కొంత భూమిని చేస్తానని పెద్దల సమక్షంలో ఒప్పుకుంది. కానీ చిన్న కొడలు సునీత తనను పట్టించుకోవడం లేదని, తనకు ఎలాంటి భూమి చేయనని చెప్పింది. దీంతో ఈ విషయమై రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసినట్లు తెలిపింది. కానీ రెవెన్యూ అధికారులు ఇవేమి పట్టించుకోకుండా తన కొడుకు భూమిని కోడలు పేరిట ఫౌతీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్టర్ జరిగిన విషయం తెలుసుకున్న గంగా మాధవి తహసీల్దార్ కార్యాలయం వద్ద తనకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగింది. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులు ఆందోళనకారులను సముదాయించారు. కాగా, భర్త చనిపోవడంతో అట్టి భూమిని భార్య సునీత పేరిట రిజిస్టర్ చేశామని, ఈ విషయంలో గతంలోనే వారికి నోటీసులు సైతం అందజేశామని తహసీల్దార్ చెప్పారు.

జోనల్ స్థాయి క్రీడలకు ఎంపిక



విద్యార్థులను సన్మానించిన ఎంఈఓ సత్తయ్య

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్ విద్యార్థినులు జోనల్ స్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారని ఎంఈఓ బచ్చలి సత్తయ్య పేర్కొన్నారు. సిద్దిపేటలో నిర్వహించిన అండర్ 14 బాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్ జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చుతూ ప్రథమ స్థానంలో నిలిచి జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు. సమాజంలో క్రీడారంగానికి మంచి గుర్తింపు ఉందన్నారు. జోనల్ స్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం దక్కేలా శిక్షణనిచ్చిన పీఈటీ రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ క్రీడా కారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు పాల్కంపల్లి నరేందర్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ నవనీత పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు మాధవి ఎంపిక


మాధవి

గజ్వేల్‌రూరల్: ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అహ్మదీపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మాధవి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుగుణాకర్ తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని మాధవి ఈనెల 18న పటాన్‌చెరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన జోనల్‌స్థాయి చెస్ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థిని మాధవితో పాటు పీడీ నాగేష్‌ను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం రాణించి తమ పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం కావాలి

ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

ములుగు(గజ్వేల్): అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలన్నీ పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ముందుకు సాగాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ బాలకిష్టారెడ్డి పిలుపు నిచ్చారు. ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వేదికగా రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రాబోయే 20 నుంచి 30 సంవత్సరాల పాటు కచ్చితంగా పర్యావరణ మార్పుల ప్రభావం ఉండనుందన్నారు. అందుకు అనుగుణంగా పర్యావరణాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. పర్యావరణం మార్పులు ప్రపంచవ్యాప్తంగా వస్తున్నాయని అయితే వాటిని తట్టుకునే కార్యక్రమాలు స్థానికంగానే రావాల్సి ఉందన్నారు. అందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని బాలకిష్టారెడ్డి కోరారు. సదస్సుకు హాజరైన విద్యార్థులకు ఈసందర్భంగా సర్టిఫికెట్లను అందజేశారు. ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ రాజిరెడ్డి మాట్లాడుతూ వాతావరణ ఆధారిత ఉద్యాన, వ్యవసాయ సలహాలను రేతులందరికీ చేర్చేలా విస్తరణ సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు.

డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి..


అశ్విని

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. డివిజన్ పరిధిలోని జేపీ కాలనీకి చెందిన అశ్విని గురువారం ఉదయం గచ్చిబౌలిలో ఓ ప్రైవేట్ కంపెనీలో చేసే హౌస్ కీపింగ్ పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. తిరిగి రాత్రి ఇంటికి రాకపోవడంతో భర్త కార్తీక్ ఆమె ఆచూకీ కోసం ఎంత గాలించినా ఫలితం దక్కలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం


గౌతమ్

పటాన్‌చెరు టౌన్: ఇంట్లో గొడవపడి ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వరం బండకు చెందిన గౌతమ్ ఈ నెల12వ తేదీన ఇంట్లో గొడవపడ్డాడు. అనంతరం ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేసి చూడగా స్విచ్ ఆఫ్ వచ్చింది. గౌతమ్ కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. తమ్ముడు అదృశ్యంపై అన్న గణేష్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాళ్లకల్‌లో..


నర్సింహులు

మనోహరాబాద్(తూప్రాన్): రోజులాగే పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన బ్యాగరి అలియాస్ గుజ్జుల నర్సింహులు(40) టెంట్‌హౌస్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన ఇంట్లోంచి వెళ్లిన నర్సింలు ఇంటికి రాలేదని భార్య హేమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రెండు షాపుల్లో అగ్ని ప్రమాదం

చేగుంట(తూప్రాన్): రెండు షాపుల్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గురుమూర్తి పాల ప్యాకెట్ల అమ్మకాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పాలను శీతలంగా మార్చే ఫ్రిజ్‌లలో మంటలు చెలరేగగా స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పేశారు. శుక్రవారం రోజున బాలాజీ పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకోగా.. ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేయగా మంటలను ఆర్పివేసారు. ఈ రెండు ప్రమాదాల్లో జనాలకు అపాయం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన ఆటో

మహిళ మృతి.. ఏడుగురికి గాయాలు

జిన్నారం (పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంబాపూర్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డి కథనం ప్రకారం.. గురువారం రాత్రి మెదక్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై గల మంబాపూర్ ప్రయాణ ప్రాంగణం వద్ద తలారి ఇందిర (42) మార్కెట్ చేసుకొని ఆటోలో ఇంటికి వెళుతోంది. ఈ క్రమంలో రోడ్డు పక్కనే ఆగి ఉన్న వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. మరో వ్యక్తి జిన్నారం మున్సిపాలిటీకి అందూరు గ్రామానికి చెందిన యాదగిరి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ శేషయ్య సహా ఏడుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి వైద్యం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

షాపింగ్‌మాల్‌కు జరిమాన

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని ఒక ప్రముఖ షాపింగ్‌మాల్ కు శుక్రవారం మున్సిపల్ అధికారులు రూ.10 వేల జరిమానా విధించారు. మాల్ సిబ్బంది మిగిలిన భోజనం, ఆహార పదార్థాలను మురికి కాల్వలో వేయడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా సిబ్బంది ఈ జరిమానా విధించి రశీదు అందజేశారు.

అదృశ్యం.. ప్రత్యక్షం

- తమిళనాడులో అదృశ్యమైన దుబ్బాకవాసి
- రెండు వారాల తర్వాత తిరిగి సొంతూరుకు..


చాంద్ పాషాను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

దుబ్బాకటౌన్: బతుకుదెరువు కోసం తమిళనాడుకు వెళ్లి రెండు వారాల క్రితం అదృశ్యమైన వ్యక్తి ఎట్టకేలకు సొంతూరుకు చేరుకున్నాడు. ఎస్ఐ కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక రెండు పడక గదుల సముదాయంలో చాంద్ పాషా, ఇబ్రహీం, ప్రవీణ్ కూలి పనులు చేసేందుకు తమిళనాడు రాష్ట్రంలోని మధురైకి నెల రోజుల క్రితం వెళ్లారు. అక్కడ రెండు వారాలు పనిచేసిన అనంతరం వీరు దుబ్బాకకు తిరిగి వస్తున్న క్రమంలో కల్లుకు బానిసై, మతిస్థిమితం తప్పినట్టు ప్రవర్తిస్తున్న చాంద్ పాషా చెన్నైలోని ఎగ్మోర్ రైల్వేస్టేషన్లో అదృశ్యమయ్యాడు. దీంతో మిగతా స్నేహితులు ఇబ్రహీం, ప్రవీణ్ అక్కడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి దుబ్బాకకు తిరిగివచ్చారు. దీంతో చాంద్‌పాషా కుటుంబ సభ్యులు దుబ్బాక పోలీసులకు విషయం చెప్పారు. పోలీసుల సూచనతో పాషా వ్యక్తి కుటుంబ సభ్యులు చెన్నై వెళ్లి, అక్కడి ఎగ్మోర్ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. అదృశ్యమైన చాంద్ పాషా వారం రోజుల పాటు వివిధ రైళ్లలో ప్రయాణిస్తూ, ఎట్టకేలకు రెండు రోజుల క్రితం కాచిగూడ రైల్వే స్టేషన్ చేరుకొని, బంధువుల ఇంటికి వెళ్లాడు. వెంటనే అక్కడి బంధువులు చాంద్ పాషా క్షేమ సమాచారాన్ని, అతని కుటుంబ సభ్యులకు చేరవేసి, శుక్రవారం ఉదయం దుబ్బాక తీసుకువచ్చారు. దుబ్బాక పోలీసుల సమక్షంలో చాంద్ పాషాను కుటుంబ సభ్యులకు అప్పగించడంతో అదృశ్యం కథ సుఖాంతమైంది.

సమగ్ర విచారణ జరపాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

చేగుంట(తూప్రాన్): దళిత మహిళ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పొలంపల్లిలో లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆత్మహత్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దళిత మహిళను పంచాయతీ కార్యదర్శి స్రవంతి వేధింపులకు గురి చేయడాన్ని తప్పు పట్టారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫోన్ చేసి లక్ష్మి ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, దళిత సంఘాల నాయకులు, పలువురు అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ బడులను పరిరక్షిద్దాం

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడంతో పాటు, విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మల్లుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతీ విగ్రహాలతో పాటు భారత దేశ మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే విగ్రహాలను సైతం పాఠశాలల ఆవరణలో ప్రతిష్ఠించాలని ఆకాంక్షించారు.

రవాణా సమస్య పరిష్కరించండి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న పద్మారెడ్డి

మెదక్ కలెక్టరేట్: బ్రిడ్జి మరమ్మతులు చేపట్టి ఏడు గ్రామాలకు రవాణా సమస్యను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో మెదక్ నుంచి శివ్వాయిపల్లికి వెళ్లే దారిలో గల బ్రిడ్జి కొట్టుకుపోయిందని, వంతెనను పునరుద్ధరించాలని కోరారు. అలాగే రాయిన్‌పల్లి ప్రాజెక్ట్ కాల్వలకు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. పంట పొలాల్లో ఇసుక మేటలు పెట్టడం ద్వారా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేల నష్ట పరిహారం చెల్లించాలన్నారు.

చెత్త వేయకుండా ముగ్గులు



నర్సాపూర్: రోడ్ల పక్కన చెత్త వేయకుండా మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి వినూత్న చర్యలు చేపట్టారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మెప్మా సిబ్బంది పట్టణంలోని సంగారెడ్డి రోడ్డు పక్కన చెత్త పారవేసే ప్రాంతాన్ని గుర్తించారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి మెప్మా సిబ్బందితో ముగ్గులు వేయించి అందంగా తీర్చిదిద్దారు. వ్యాపారులు ఇష్టానుసారంగా చెత్త పారవేస్తున్నారని, సిబ్బందికి అందజేయాలని కమిషనర్ సూచించారు. కాగా మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ మధుసూదన్, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన డాక్టర్లు దీప్తి, డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.